బీజేపీ నేత ప్రతాప్ ఇంటికి త్రిపుర గవర్నర్

హయత్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్ర సేనారెడ్డి సోమవారం సాయంత్రం తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ స్నేహపురికాలనీలో నివాసం ఉంటున్న బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు, పార్టీ సీనియర్ నాయకుడు బోసుపల్లి ప్రతాప్ ఇంటికి వచ్చారు. ఈ సందర్భంగా పార్టీలో కలిసి పనిచేసిన రోజులను గుర్తు చేసుకున్నారు. పార్టీలో నిబద్ధతగా పని చేస్తున్నారని బోసుపల్లి ప్రతాప్‌ను అభినందించారు. కష్టపడి చేసే కార్యకర్తలకు బీజేపీలో మంచి గుర్తింపు ఉంటుందని ఇంద్రసేనారెడ్డి అన్నారు. వారితో రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండటి శ్రీధర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అంజన్‌కుమార్‌గౌడ్, బీఎస్‌పీ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధా కృష్ణ, కొండ్రు పురుషోత్తం తదితరులు ఉన్నారు.

గవర్నర్‌ను కలిసిన బీజేవైఎం నేత అనిల్‌కుమార్

చంపాపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డిని సోమవారం బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చంపాపేటకు చెందిన సిల్వేరు అనిల్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల శబరిమలకు వెళ్లి వచ్చిన అనిల్‌కుమార్ అయ్యప్పస్వామి ప్రసాదాన్ని ఇంద్రసేనారెడ్డికి అందజేశారు. చంపాపేట డివిజన్‌కు తొలిసారిగా విచ్చేసిన సందర్భంగా గవర్నర్‌ను ఆయన శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తిరుపతి రెడ్డి, రమేష్, టింగ్లీకర్ రాజేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.


సత్యనారాయణరెడ్డిని పరామర్శిస్తున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

సత్యనారాయణరెడ్డికి గవర్నర్ పరామర్శ

చంపాపేట, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనారెడ్డి సోమవారం చంపాపేట రెడ్డిబస్తీలోని సీనియర్ నాయకుడు మంద బాల్ రెడ్డి కన్వెన్షన్ యజమాని మంద సత్యనారాయణరెడ్డిని పరామర్శించారు. కొన్ని రోజుల నుంచి అనారోగ్యంతో ఉన్న సత్యనారాయణరెడ్డి యోగక్షేమాలను గవర్నర్ అడిగి తెలుసుకున్నారు. ఆయనతో కలిసి గవర్నర్ అల్పాహారం తీసుకున్నారు. హనుమాన్ దేవస్థానం మాజీ ధర్మకర్తలు సామ రంగారెడ్డి, గూడూరు మధుసూదన్‌రెడ్డి, నాయకులు మంద రాంచంద్రారెడ్డి, రమణారెడ్డి, మెట్టు వెంకట్‌రెడ్డి, జిట్టా తిరుపతిరెడ్డి, సామ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

ఆకట్టుకున్న విజ్ఞాన ప్రదర్శన


విద్యార్థులు రూపొందించిన నమూనాలను పరిశీలిస్తున్న ఉపాధ్యాయులు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ హిల్‌కాలనీలోని బచ్‌పన్ అకడమిక్ హైట్స్ పబ్లిక్ స్కూల్లో రెండు రోజులుగా నిర్వహించిన విజ్ఞాన ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. ఈ మేరకు విద్యార్థులు రూపొందించిన పలు నమూనాలు ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల రీజనల్ డైరెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు వారిలో దాగి ఉన్న సృజనాత్మక శక్తిని వెలికితీయడానికి విజ్ఞాన ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ సునీత శ్రీనివాస్, ప్రిన్సిపాల్ కల్పవల్లి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంప్రదాయ ఉత్సవాలు



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

చాదర్‌ఘాట్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని శ్రీవెంకటేశ్వర జూనియర్ కళాశాల వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నిర్వహించిన సంప్రదాయ ఉత్సవాలు ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. కళాశాల చైర్మన్ పమ్మి సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఉత్సవాలకు ప్రముఖ సంఘ సేవకులు, కోదాడలోని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల లెక్చరర్ సంగోజు నాగాచారి ముఖ్యఅతిథిగా విచ్చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా హీరోలు, ఇతర వ్యామోహాలతో సమయం, ధనం వృథా అవుతుందన్నారు. మీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను ఆదర్శంగా తీసుకుని జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ కేసీ రాజు కామేశ్వర్‌రావుతోపాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.


సీపీఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యాదయ్య తదితరులు

సీపీఐ శతాబ్ది ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

హయత్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సీపీఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన వాల్ పోస్టర్‌ను సోమవారం తుర్కయంజాల్ చౌరస్తాలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు ఓరుగంటి యాదయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 1926 డిసెంబరు 26న ఆవిర్భవించిందని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి దేశ స్వాతంత్ర్యం కోసం అనేక పోరాటాలు చేసిందన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో భూమి కోసం, భుక్తి కోసం అనే నినాదంతో గెరిల్లా దలాన్ని నడిపి నాలుగు వేల మంది ప్రాణాలను త్యాగం చేసిన గొప్ప చరిత్ర సీపీఐకి ఉందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ సభ్యుడు శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతు కుటుంబానికి ఆర్థిక చేయూత

అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుంతపల్లికి చెందిన రైతు కరిమల పోచయ్య ఆగస్టులో మృతిచెందారు. దీంతో మృతిచెందిన రైతు కుటుంబానికి బాటసింగారం రైతు సేవా సహకార సంఘం తరఫున రూ.25వేలను మంజూరు చేశారు. సోమవారం సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్ చెక్కును పోచయ్య భార్య కరిమల నరసమ్మకు అందజేశారు. కార్యక్రమంలో సహకార సంఘం డైరెక్టర్ గుంట శ్రీనివాస్‌రెడ్డి, నార్లకొండ జంగమయ్య యాదవ్, అకౌంటెంట్ రాకేష్ పాల్గొన్నారు.


ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ది అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం తదితరులు

విశ్వకర్మ మహాసభను విజయవంతం చేయండి

వనస్థలిపురం, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో ఈనెల 27న నిర్వహించనున్న ది అఖిల భారత విశ్వకర్మ ద్వితీయ మహాసభను విజయవంతం చేయాలని ది అఖిల భారత విశ్వకర్మ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కౌలే జగన్నాథం కోరారు. సోమవారం కౌలే జగన్నాథం ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్, అంబర్‌పేట్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, బీజేపీ నాయకులు చికోటి ప్రవీణ్‌కుమార్ ఇతర ప్రముఖులను కలిసి ద్వితీయ మహాసభ కార్యక్రమ ఆహ్వానపత్రికను అందజేసి మహాసభకు రావాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విశ్వకర్మ మహాసభ ప్రతినిధులు పాల్గొన్నారు.

మ్యాన్‌హోళ్ల ధ్వంసం..

రాకపోకల్లో నరకం


శ్రీసాయినగర్ కాలనీ రోడ్ నంబర్.2లో రోడ్డుకి మధ్యభాగాన ధ్వంసమైన మ్యాన్‌హోల్

- పాదచారులు, వాహనదారుల పాట్లు
- మరమ్మతులు చేపట్టడంలో అధికారుల జాప్యం


సాయి సప్తగిరి కాలనీలోని సీసీ రోడ్డుపై పడిన రంధ్రానికి నామమాత్రపు సూచిక ఏర్పాటు చేసిన కాలనీవాసులు

మన్సూరాబాద్, డిసెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రధాన రోడ్లపై ఉన్న డ్రైనేజీ మూతలు శిథిలమై పగిలిపోయి ప్రమాదాలకు కారణమవుతున్నాయి. దీంతో అటుగా రాకపోకలు సాగించే పాదచారులు, వాహనదారులకు తీవ్ర అంతరాయం కలగడమే కాకుండా ప్రమాదాలకు దారితీస్తున్నాయి. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్‌కాలనీ, సాయి సప్తగిరికాలనీల ద్వారా రాకపోకలు సాగించే ప్రధానరోడ్డుపై డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు శిథిలావస్థలో ఉన్నాయి. శ్రీసాయినగర్ కాలనీ రోడ్ నంబర్.2లో మన్సూరాబాద్ ప్రధాన రోడ్డుకు చేరువగా దుర్గాదేవి ఆలయానికి సమీపాన రోడ్డుకు మధ్యభాగంలో డ్రైనేజీ మ్యాన్‌హోల్ ఇరవై రోజులకు పైగా పూర్తిగా ధ్వంసమై ఉంది. సమస్యను పలుమార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేపడతామని చెప్పి నాలుగు రోజుల క్రితం ప్రమాదకసూచిక గ్రిల్ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. రోజులు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడంతో రాకపోకల్లో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మార్గం గుండా పలు చోట్ల..

శ్రీసాయినగర్ కాలనీ నుంచి సాయి సప్తగిరికాలనీ గుండా జనప్రియ ఎన్‌క్లేవ్ వెళ్లే ప్రధాన రోడ్డు గుండా పలు చోట్ల డ్రైనేజీ మ్యాన్‌హోల్ వ్యవస్థ శిథిలావస్థకు చేరుకుంది. ఏ క్షణాన అయినా అవి పూర్తిగా ధ్వంసమయ్యే ఆస్కారం ఉంది. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే వారు భయభ్రాంతులకు గురవుతున్నారు.

సాయి సప్తగిరికాలనీ రోడ్డుపై భారీగా రంధ్రం..

మన్సూరాబాద్ డివిజన్ శ్రీసాయినగర్‌కాలనీ నుంచి జనప్రియ ఎన్‌క్లేవ్ పార్కుకు వెళ్లే మార్గమధ్యలో గల సాయి సప్తగిరికాలనీ ప్రధాన రోడ్డుపై భారీగా రంధ్రం పడింది. దీంతో స్థానికులు ఈ భాగంలో రాళ్లు, చెట్ల కొమ్మలతో నామమాత్రపు సూచికలు ఏర్పాటు చేశారు. ప్రమాదాలు సంభవించకముందే సంబంధిత అధికారులు వెంటనే మరమ్మతులు జరపాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

హామీలు అమలు చేయలేక చేతులెత్తేసిన కాంగ్రెస్ సర్కార్

- ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపణ

సరూర్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం.. దాని నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు ఇతర అంశాలను తెరపైకి తెస్తున్నదని మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ఆరోపించారు. రేవంత్ హయాంలో రాష్ట్రంలో అవగాహన లేని పాలన నడుస్తున్నదని, అన్ని రంగాలూ అస్తవ్యస్తంగా మారాయని ఆమె ధ్వజమెత్తారు. సోమవారం మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని మిషన్ భగీరథ ట్యాంకులను ఆమె పరిశీలించారు. ట్యాంకులకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం లెనిన్‌నగర్‌లో నిర్మాణంలో ఉన్న మినీ ఫంక్షన్ హాల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఇంటింటికీ నల్లా నీరు ఇచ్చిన తర్వాతే ఓట్లు అడుగుతానని ప్రకటించి ఆ హామీని అమలు చేసి చూపించారని అన్నారు. నేడు ప్రజలు తాగుతున్న స్వచ్ఛమైన నీరు కేసీఆర్ అమలు చేసిన మిషన్‌భగీరథ పుణ్యమేనని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో మీర్‌పేట్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, వాటర్ బోర్డు జీఎం శ్రీనివాస్‌రెడ్డి, మేయర్ దుర్గాదీప్‌లాల్, డిప్యూటీ మేయర్ తీగల విక్రమ్‌రెడ్డి, బీఆరఎస్ మీర్‌పేట్, బడంగ్‌పేట్ అధ్యక్షులు కామేశ్‌రెడ్డి, రాంరెడ్డి, పలువురు కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.


మీర్‌పేట్‌లో మిషన్ భగీరథ వాటర్ ట్యాంకును పరిశీలించి అధికారులను అడిగి వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డి


చిన్నారులతో కేక్ కట్ చేయిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ చారువాక్

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

సైదాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): సైదాబాద్‌లోని జువెనైల్ హోంలో సోమవారం ముందస్తు క్రిస్మస్ వేడుకలు చిన్నారులతో కలిసి సిబ్బంది ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పూల్‌సింగ్ బాబ్జీ, జయరాజ్ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో జువెనైల్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చారువాక్, ఏసీపీఎస్ నవీన్, హోం సూపరింటెండెంట్లు అఫ్జల్ సహాలీ, సంఘమేశ్వర్, మైథిలీ ఆఫీస్ సూపరింటెండెంట్లు గోపి కుమార్, జ్వాల పాల్గొన్నారు.

ఉద్యమకారుడు రుద్రాల స్వామికి అరుదైన గౌరవం

మన్సూరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): పలు రకాల సాంస్కృతిక కళా ప్రదర్శనలతో ఆకట్టుకునే తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు ఎల్బీనగర్‌కు చెందిన రుద్రాల స్వామికి అరుదైన గౌరవం దక్కింది. తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవాసంస్థ ఆధ్వర్యంలో ఆదివారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మురళీకృష్ణ తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డును రుద్రాల స్వామికి అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిన 'చప్పిడి'


కేఎల్లార్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన రాజిరెడ్డి

సరూర్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ అల్మాస్‌గూడకు చెందిన ఇండిపెండెంట్ కంటెస్టెడ్ కార్పొరేటర్ చప్పిడి రాజిరెడ్డి సోమవారం హస్తం గూటికి చేరుకున్నారు. గతంలో టీడీపీ, బీఆర్ఎస్, బీజేపీ పార్టీల్లో క్రియాశీలక నేతగా పని చేసిన రాజిరెడ్డి.. 2020 మునిసిపల్ ఎన్నికల్లో అల్మాస్‌గూడ 24వ డివిజన్‌లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పటి నుంచి రాజకీయాలకు దూరంగా ఉంటున్న ఆయన సోమవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీ మహేశ్వరం నియోజకవర్గం ఇన్‌చార్జి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని ఈ సందర్భంగా కేఎల్లార్ పేర్కొన్నారు.

మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేస్తాం

- తుర్కయంజాల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి

హయత్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి) : తుర్కయంజాల్ మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేయనున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని 18, 19, 22వార్డుల్లో రూ. 4కోట్ల9లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆమె స్థానిక కౌన్సిలర్లు సునీల్, నారని కవిత, కొశికఐలయ్యతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ప్రధానంగా మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందన్నారు. అనేక కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ, సీసీరోడ్లు, తాగునీటి వసతి, వీధి దీపాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. ప్రధానంగా నెలకొన్న ట్రంకులైను సమస్యకు కూడా పరిష్కారం చూస్తున్నామని తెలిపారు. మున్సిపాలిటీ వేగంగా అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. వైస్ చైర్‌పర్సన్ హరిత, కౌన్సిలర్లు కొత్తకుర్మ మంగమ్మ, రవీందర్‌రెడ్డి, శివలింగంగౌడ్, కమిషనర్ అమరేందర్‌రెడ్డి, నాయకులు కుంట గోపాల్‌రెడ్డి, మర్రి మహేందర్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, రాగ్యానాయక్, రాజు, వెంకటేశ్ యాదవ్, వెంకట్రావ్, ఏశ చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధారాంరెడ్డి

పార్కు స్థలాలను పరిశీలించిన హైడ్రా అధికారులు

- బీజేపీ నేతల ఫిర్యాదు నేపథ్యంలో..

సరూర్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లలో పార్కు స్థలాలు అన్యాక్రాంతం కావడంపై బీజేపీ నేతలు హైడ్రా కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో సోమవారం హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్ తదితరులు ఇక్కడి పార్కు స్థలాలను పరిశీలించారు. ఫిర్యాదుదారులైన బీజేపీ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు చెరుకుపల్లి వెంకట్‌రెడ్డి, యువమోర్చా అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి తదితరులు కబ్జాకు గురైన పార్కు స్థలాలను హైడ్రా అధికారులకు చూపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేషన్‌లోని పార్కు స్థలాల కబ్జా, వాటిలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలపై ఈనెల 16న తాము హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. కార్పొరేషన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు సదరు ఆక్రమణలపై ఏమాత్రం స్పందించడంలేదని, బడా నేతలు ఇందులో పాత్రదారులుగా ఉన్నారని రంగనాథ్‌కు వివరించినట్టు వారు చెప్పారు. తమ ఫిర్యాదు నేపథ్యంలో ఇక్కడకు వచ్చిన హైడ్రా అధికారులకు తాము ఆయా కబ్జాలను చూపించామని, ఎస్ఎన్‌డీపీ నాలాల ప్రాంతంలోని ఆక్రమణలను సైతం వివరించామని వెంకట్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. వాటిపై నివేదిక రూపొందించి కమిషనర్‌కు ఇవ్వనున్నట్టు ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్ చెప్పినట్టు వారు తెలిపారు.


బడంగ్‌పేట్‌లో పార్కు స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హైడ్రా ఇన్‌స్పెక్టర్ తిరుమలేశ్

బైకును ఢీ కొట్టిన లారీ

- ఇద్దరు డిప్లొమా విద్యార్థులకు తీవ్రగాయాలు
- ఒకరి పరిస్థితి విషమం

హయత్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): వేగంగా వస్తున్న లారీ బైకు పైన వస్తున్న ఇద్దరు విద్యార్థులను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలకు గురైన విద్యార్థులను పోలీసులు ఆస్పత్రికి తరలించారు. ఓ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం మధ్యాహ్నం పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు వద్ద జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. మంచిర్యాల జిల్లా చెన్నూరుకు చెందిన రాజాపతి(20), అదే జిల్లాలోని సుద్దాల గ్రామానికి చెందిన అభిరాం(16) అబ్దుల్లాపూర్‌మెట్‌లోని బ్రిలియంట్ ఇంజనీరింగ్ కళాశాలలో డిప్లొమా మొదటి సంవత్సరం చదువుతున్నారు. వీరిందరు హయత్‌నగర్ భాగ్యలత కాలనీలోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో ఉంటూ డిప్లొమా చేస్తున్నారు. సోమవారం ఉదయం 10గంటలకు బైకు పైన కళాశాలకు వెళ్లారు. మధ్యాహ్నం 1.30గంటలకు కళాశాల నుంచి హాస్టల్‌కు వస్తున్నారు. పెద్దఅంబర్‌పేట్ ఔటర్ రింగు రోడ్డు వద్దకు చేరుకోగానే కొహెడా సర్వీస్ రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి వస్తున్న టిప్పర్ విద్యార్థుల బైకును వేగంగా ఢీకొట్టింది. దీంతో ఇద్దరు విద్యార్థులు తీవ్ర గాయాలకు గురై రోడ్డు పైన పడి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే హయత్‌నగర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని తీవ్ర గాయాలకు గురైన ఇద్దరిని హయత్‌నగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. రాజాపతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. అభిరాం కాలుకు తీవ్ర గాయమైందని తెలిపారు. ఇద్దరికి తలకు ఇతర భాగాలకు కూడా గాయాలు అయ్యాయి. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


తీవ్ర గాయాలకు గురైన అభిరాం, రాజాపతి


కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభిస్తున్న మేయర్ పారిజాతారెడ్డి

కమ్యూనిటీ హాల్ పనులు ప్రారంభం

సరూర్‌నగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని అల్మాస్‌గూడ 24వ డివిజన్‌లో నిర్మించనున్న కమ్యూనిటీ హాల్ పనులకు సోమవారం కార్పొరేటర్ ఏనుగు రాంరెడ్డితో కలిసి మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీవాసులు సమావేశాలు నిర్వహించుకోవడానికి అనువుగా కమ్యూనిటీ హాల్స్ నిర్మిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బోయపల్లి గోవర్ధన్ రెడ్డి, మునిసిపల్ డీఈఈ నర్సింహారాజు, యూత్ కాంగ్రెస్ బడంగ్‌పేట్ శాఖ అధ్యక్షుడు పి.రవికాంత్‌రెడ్డి, నాయకులు ప్రతాప్‌రెడ్డి, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.


చికిత్స అనంతరం ఆరోగ్యంగా ఉన్న నర్సింహాతో కామినేని వైద్య సిబ్బంది

కామినేనిలో అరుదైన శస్త్రచికిత్స

మన్సూరాబాద్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఓ యువకుడికి ఎల్బీనగర్‌లోని కామినేని ఆస్పత్రి వైద్యులు అరుదైన శస్త్ర చికిత్సతో ప్రాణం పోశారు. కామినేని వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురానికి చెందిన ఈవెంట్ మేనేజర్ నర్సింహ ఇటీవల హయత్‌నగర్ సమీపంలో రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన కారు అతడిని ఢీకొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడ్డ నర్సింహను సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం మరో కార్పొరేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడి వైద్యులు బతకడం కష్టమని తేల్చిచెప్పారు. పెద్దలు ఒప్పుకోకున్నా ప్రేమ పెళ్లి చేసుకుని 15 రోజులు గడవక ముందే ప్రమాదానికి గురైన తన భర్తను కాపాడుకోవాలని తపించిన నర్సింహ భార్య 'స్వేచ్ఛ' వెంటనే కామినేని ఆస్పత్రికి తీసుకువచ్చింది. క్రిటికల్ కేర్ విభాగాలతో పాటు న్యూరో, కార్డియోథెరాసిక్ సర్జన్లు తీవ్రంగా శ్రమించి సుమారు మూడు నెలల పాటు మెరుగైన శస్త్ర చికిత్స అందించడంతో నర్సింహ కోలుకున్నట్లు కామినేని వైద్యులు తెలిపారు.

'ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ'

ఎల్బీనగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ నర్సింహారావు అని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతిని పురస్కరించుకుని అల్కాపురి చౌరస్తాలోని ఆయన విగ్రహానికి తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ క్లిష్టపరిస్థితుల్లో ఉన్నప్పుడు పార్టీ పగ్గాలను చేపట్టి ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతూ దేశ ప్రధాని పదవిని అధిష్ఠించి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి ఉపాధ్యక్షులు దేశ్‌ముఖ్ రమాకుమార్, కోశాధికారి మంత్రి సునీల్, ప్రముఖ న్యాయవాది కానాల శ్యాంసుందర్‌రావు, గుడా జయరాం, శశాంక్ మోహన్ పాల్గొన్నారు.

జాగో చైర్మన్‌ను కలిసిన సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం

చంపాపేట, డిసెంబర్ 23(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర సెక్యూలర్ డెమొక్రటిక్ ఫ్రంట్ (జాగో) రాష్ట్ర జాగో చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి బి.చంద్రకుమార్‌ను హస్తినాపురం డివిజన్‌లో కలిసి తమ సమస్యల పరిష్కారం కోసం కృషిచేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల సంఘం నేతలు మాట్లాడుతూ విద్యాశాఖలోని సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గతంలో 2023 ఆగస్టు, సెప్టెంబర్ మాసంలో తాము సమ్మె చేస్తున్న సమయంలో నాటి టీపీసీసీ అధ్యక్షుడు, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి తమ ఉద్యోగాలను రెగ్యులర్ చేయనున్నట్లు, పేస్కేల్ ఇవ్వనున్నట్లు తమకు హామీ ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. 18సంవత్సరాల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా 19,600మంది ఉద్యోగులు సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి జి.ఝాన్సీ సౌజన్య పాల్గొన్నారు.

నగరానికి చేరుకున్న గోరక్ష మహా పాదయాత్ర

- కొత్తపేట చౌరస్తాలో ఘన స్వాగతం పలికిన హనుమాన్ యువసేన


గోరక్ష మహా పాదయాత్ర చేస్తున్న బాలకృష్ణ గురుస్వామికి స్వాగతం పలుకుతున్న హనుమాన్ యువసేన అధ్యక్షుడు యశ్పాల్‌గౌడ్ తదితరులు

ఎల్‌బీనగర్, డిసెంబరు 23(ఆంధ్రజ్యోతి): గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలని కోరుతూ గోమాత రక్షణ కోసం అఖిల భారత గో సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోరక్షకుడు బాలకృష్ణ గురుస్వామి గోరక్ష సంకల్ప దీక్ష తీసుకుని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేస్తున్న గోరక్ష మహాపాదయాత్ర సోమవారం నగరానికి చేరుకుంది. గోరక్ష మహాపాదయాత్రకు కొత్తపేట చౌరస్తాలోని భవానీ మాత ఆలయం వద్ద హనుమాన్ యువసేన అధ్యక్షుడు యశ్పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా బాలకృష్ణగురుస్వామి మాట్లాడుతూ గోమాతను కాపాడాలని, గోమాతను జాతీయ ప్రాణిగా ప్రకటించాలన్న డిమాండ్‌తో మూడు నెలలుగా గోరక్ష మహాపాదయాత్ర చేస్తున్నామన్నారు. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేస్తున్న ఈ మహాపాదయాత్ర ఇప్పటి వరకు 9 రాష్ట్రాల గుండా నేడు నగరానికి చేరుకోవడం జరిగిందన్నారు. గోమాతను కాపాకుందాం..మన ధర్మాన్ని కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భవానీ మాత ఆలయం చైర్మన్ రుషి, అఖిల్‌గౌడ్, విష్ణువర్ధన్‌రెడ్డి, రాజేందర్, భాస్కర్, కిరణ్‌కుమార్, వినోద్, తరుణ్ సింగ్ ఠాగూర్, అవినాష్, వరుణ్, వేణు, సంప్రీత్, యశ్వంత్, విష్ణు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

శాలివాహననగర్‌లో..

చాదర్‌ఘాట్ : ధర్మం కోసం, గోవు కోసం కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు గోరక్ష మహాపాద యాత్ర చేస్తూ మూసారాంబాగ్ శాలివాహననగర్ కాలనీలో గల నారాయణి గోసేవ గోశాలకు విచ్చేసిన బాలకృష్ణ గురుస్వామికి గోశాల ప్రతినిధులు సోమవారం ఘన స్వాగతం పలికారు. ఇంతవరకు కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు చేపట్టిన గోరక్ష మహా పాదయాత్ర సెప్టెంబరు 27న ప్రారంభమై 88 రోజులుగా పాదయాత్ర ద్వారా 9రాష్ట్రాలు దాటి 2,750 కిలోమీటర్లు పూర్తి చేసినట్లు బాలకృష్ణ గురుస్వామి తెలిపారు. తాను ఇక్కడి గోశాల నుంచి కన్యాకుమారికి పాదయాత్ర ద్వారా బయల్దేరుతున్నట్లు తెలిపారు. గోరక్షణ, భూరక్షణ, పర్యావరణ రక్షణ ఈ మహాపాదయాత్ర ముఖ్యోద్దేశమని ఆయన వివరించారు. గోశాల ట్రస్టీలు అమన్ సోనీ, మోహన్‌బాబు, ద్వారకా ప్రసాద్ తివారీ, సజన్ దాగా, కరుణాకర్, సింహం గురుస్వామి, భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు రాధాకృష్ణతోపాటు బీజేపీ రాష్ట్ర నాయకులు బొక్క మధుసూదన్‌రెడ్డి, స్థానికులు పవన్‌కుమార్, వెంకట్‌రెడ్డి ఘన స్వాగతం పలికిన వారిలో ఉన్నారు.